క్లుప్తంగా

కాంగ్రెస్ కార్యాలయంలో 'దావతే ఇఫ్తార్'



స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ కార్యాలయంలో 'దావతే ఇఫ్తారు' విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలువురికి ఖర్జూర్, పండ్లు తినిపించారు. మతపెద్ద ప్రత్యేక దువా చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షులు మహ్మద్ ఫయాజ్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అడ్డాకుల: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ కురుమూర్తి అన్నారు. మండలంలోని కందూర్ జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు.

వాల్‌పోస్టర్ విడుదల

చిన్నచింతకుంట: తెంగాణ ప్రగతిశీల భవన, ఇతర కార్మిక సంఘం, టీయూసీఐ అనుబంధ సంఘాల రాష్ట్ర మహాసభలు ఈనెల 25న మహబుబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు బీఓసీ జిల్లా అధ్యక్షుడు కోళ్ల వెంకటన్న తెలిపారు. బుధవారం చిన్నచింతకుంటలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు అడివన్న, ఎం.రాజు, శ్రీనివాస్, రాజు, లింగన్న, వెంకటేష్ ఉన్నారు.

నిత్యావసర కిట్లు పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ ను పురస్కరించుకొని ఇమ్రాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఆ సొసైటీ కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సొసైటీ ప్రతినిధి, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడారు. ఆరేళ్ల నుంచి ఇమ్రాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎండి.అతహర్, ఫిరోజ్, మహమ్మద్ సమీర్, అస్రార్ అహ్మద్, మహ్మద్ జలాల్, ఎండి.హసన్, తబ్రేజ్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోయ చందు గ్రామస్తులతో కలిసి పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. గ్రామస్తులు వేముల రాజరెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, చిత్తనూర్ వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు రేవతి, ఎల్లన్నతో పాటు పలువురు ఉన్నారు.

నవాబుపేట: పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని నరేష్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని పోమాల్ జెడ్పీపాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆయన అందించారు. హెచ్ఎం వెంకట్రాములు, బీఎస్పీ నాయకులు రాంచంద్రయ్య పాల్గొన్నారు.

గండేడ్: చదువుతోనే బంగారు భవిత అని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు.

మోటార్ల తొలగింపు

గండేడ్: మండలంలోని ఆయా చెరువుల్లో అక్రమంగా వేసిన మోటార్లను తహసీల్దార్ నాగలక్ష్మి తొలగింప చేశారు. రెడ్డిపల్లి రెడ్డిచెరువు, మల్లయ్య చెరువుల్లో మోటార్లు వేసి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారు. దీంతో మత్స్యకారులు కలెక్టర్ విజేయెందిర బోయికి, తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. ఆమె సోమవారం చెరువుల దగ్గరకు వెళ్లి అక్రమంగా మోటార్లు వేసిన వారికి వాటిని తీయాల్సిందిగా ఆదేశించారు. అయినా మోటార్లు తొలగించకపోవడంతో మంగళవారం మల్లయ్యచెరువు, రెడ్డిచెరువుల వద్దకు వెళ్లి వాటిని తొలగింప జేశారు.

ఇసుక డంప్ సీజ్

మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో చెరువు దగ్గర నిల్వ ఉంచిన దాదాపు ఐదు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకమే



కంకరతో లోకిరేవు రోడ్డు



కంకర, దుమ్ముతో తిర్మాలాపూర్ రోడ్డు

- ఆగిన నవాబుపేట– రాజాపూర్ రోడ్డు నిర్మాణం
- కంకర వేసిన వదిలేసిన వైనం
- బెంబేలెత్తిపోతున్న ప్రయాణికులు

నెల రోజులుగా పాట్లు పడుతున్నాం



నెల రోజులుగా పాట్లు పడుతున్నాం. అసలే గోతులతో ఇబ్బందులు పడుతుంటే డబుల్ రోడ్డు మంజూరు కావటంతో సంతోషించాం. కానీ పనులు ప్రారంబం కావటం పైగా కంకర వేసి మధ్యలో వదిలేశారు. కేవలం 4 కిలోమీటర్ల దూరం గల గ్రామానికి వెళ్లేందుకు అరగంటకు పైగానే సమయం పడుతుంది. పనులు వెంటనే ప్రారంభించి ప్రజలు మేలు చేయాలి.

– శ్రీనివాస్ (లోకిరేవు)

నవాబుపేట: మండల కేంద్రమైన నవాబుపేట నుంచి రాజాపూర్ మండల సరిహద్దు వరకు గల రోడ్డుపై ప్రయాణం నరకమే అని పలువురు ఆరోపిస్తున్నారు. ఈరోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని గతేడాది జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ.20కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించి పాత రోడ్డును తొలగించారు. కంకర వేసిన అనంతరం రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆపి వేశారు. దీంతో కంకరపై అటుగా వెళ్లాలంటే ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. దీనికంటే పాతరోడ్డు నయం అంటూ పలువురు పేర్కొంటున్నారు. నవాబుపేట నుంచి దాదాపుగా తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు డబుల్‌గా మారుతుందని అందరూ సంబర పడ్డారు. ఈ తరుణంలో రోడ్డు పనులు సైతం చురుకుగానే ప్రారంభమయ్యాయి. ఉన్నటుండి నెల రోజులుగా పనులు నిలిచిపోయావి. దీంతో దుమ్ము, కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. రోడ్డు పక్కన ఉన్న మట్టి గోతులు సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రోడ్డు ప్రయాణం చేయాలంటేనే జనం బెంబేలెత్తి పోతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంబించేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి



మాచన్‌పల్లిలో నీరందక ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు బాధిత రైతుకు రూ. 20వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలం లోని కోడూర్, మాచన్‌పల్లి గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నీరు అందక ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోరుబావులు ఎండిపోయి వరి పంట చేతికి రాకుండా పోయిందని అన్నారు. ఒక్క మాచన్‌పల్లిలోనే 45 మంది రైతుల పొలాలు నీరు అందక పొట్టకొచ్చే సమయంలో ఎండుముఖం పడుతున్నాయని తెలిపారు. నాయకులు హన్మంతు, భగవంతు, దేవేందర్‌రెడ్డి, ఖాదర్, వెంకటయ్య, అనుసూయ, మొగులయ్య, రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలు

- మహబూబ్‌నగర్ నుంచి గద్వాలకు తరలింపు

పాలమూరు: చేపల పెంపకందారులు చికెన్ వ్యర్థాలను యథేచ్ఛగా క్యాట్ ఫిష్, ఇతర చేపల పెంపకం కోసం వాడుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన వారు నిత్యం మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు భూత్పూర్‌లో ఉన్న కొన్ని చికెన్ సెంటర్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకొని అన్ని రకాల చికెన్ వ్యర్థ పదార్థాలను వాహనాల్లో తరలిస్తున్నారు. అలాంటి వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగించి ఆ తర్వాత అదే చేపలను మళ్లీ మహబూబ్‌నగర్‌లో విక్రయాలు జరుపుతున్నారు. నిత్యం మూడు నుంచి నాలుగు టన్నుల చికెన్ వ్యర్థాలను పట్టణం నుంచి గద్వాలకు తరలించి చేపలకు ఆహారంగా వాడుతున్నారు. ప్రధానంగా అక్కడ ఏర్పాటుచేసిన చేపల చెరువులలో వినియోగిస్తున్నారు. చికెన్ వ్యర్థాలను ఆహారంగా తిన్న చేపలను మనుషులు తినడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. ఈవిషయంపై మత్స్యశాఖ శాస్త్రవేత్త లక్ష్మప్పను వివరణ కోరగా నిబంధనల ప్రకారం చికెన్ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయరాదు. చికెన్ వ్యర్థాలను చెరువులో వేయడంతో నీటి కాలుష్యం ఏర్పడి అలాంటి వ్యర్థాలను ఆహారంగా తినే చేపలను మనుషులు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం



శంకర్‌లింగేశ్వరస్వామి రథం లాగుతున్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని సమస్తాపూర్ గ్రామ శివారులో ఇద్దూరు శంకర్‌లింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. సాయంత్రం 30 అడుగుల రథానికి రంగురంగుల పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తులు రథాన్ని లాగారు. దేవాలయ నుంచి సమీపంలోని రావిచెట్టు వరకు రథాన్ని లాగారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

నవాబుపేట: బడ్జెట్ విషయంలో రైతులకు, వ్యవసాయ రంగానికి మేలు చేసిందని కాంగ్రెస్, యువతను విస్మరించిందని బీఆర్ఎస్, మహిళలకు, ఉపాధి రంగానికి ప్రత్యేక కెటాయింపులు లేవని బీజేపీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. బుధవారం బడ్జెట్‌పై మండంలో వివిధ పార్టీల అభిప్రాయాలు.

అన్నదాతకు అండగా బడ్జెట్



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నదాతకు అండగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.24.439 వేల కోట్లు, సాగునీటి పరుదలకు రూ.23.373 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు కేటాయిస్తూ మొత్తం రూ.65వేల కోట్లకు పైగానే వ్యవసాయ రంగానికి కేటాయించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

– రాంచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, నవాబుపేట

రైతుపై ప్రేమ లేదు



రైతులపై ప్రేమ ఉంటే రైతు కోసం పరితపించిన ప్రభుత్వం అయితే రైతు భరోసాతో రైతు రుణ మాఫీకి బడ్జెట్‌లో ప్రత్యేకత చూపాల్సింది. అలాగే యువతకు ఉపాధి చూపుతాం వరుస నోటిఫికేషన్లు అంటూ ప్రగల్బాలు పలికిన సర్కార్ కేవలం రూ.900 కోట్లు కేటాయించడం ఏమిటి? ఇది కేవలం మభ్య పెట్టే బడ్జెట్. యువతకు, స్వయం శక్తికి, ప్రత్యేకంగా ఉపాధి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరగాలి.

– శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు, నవాబుపేట

సాదాసీదా బడ్జెట్



ఇది కేవలం సాదాసీదా బడ్జెట్. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేటాయింపులు చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కనపడటం లేదు. ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్ కేటాయించి మహిళలకు ఇస్తామన్న రూ.2,500 నగదు ఊసే ఎత్తలేదు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో స్థానం కల్పించలేదు. బీసీలకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఉంటాయనుకుంటే ఈ బడ్జెట్ నిరాశ మిగిల్చింది.

– శ్రీనివాసులు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నవాబుపేట

అక్రమ అరెస్టులు సరికాదు

చిన్నచింతకుంట: మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని మాజీ సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మోహన్‌గౌడ్ అన్నారు. బుధవారం పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. మాజీ సర్పంచ్‌లు కోటరాము, కాంతరావు, రఘువర్ధన్‌గౌడ్, శివ శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

దాడి చేసినవారిని శిక్షించాలి

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కి చెందిన రామస్వామి కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య కుటుంబం మంగళవారం రాత్రి దాడి చేసినందున నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎలుసరి కృష్ణయ్య డిమాండ్ చేశారు. బాధితులు, కేవీపీఎస్ నాయకులతో కలిసి బుధవారం అడ్డాకులలో ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

గండేడ్: రేషన్ సరఫరాలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవార్వాల్, పెద్దవార్వాల్ గ్రామాల్లోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె షాపుల్లోని స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలనెల క్రమం తప్పకుండా వినియోగదారులకు బియ్యాన్ని ఇవ్వాలని ఆమె ఆదేశించారు. రేషన్‌బియ్యం బ్లాకులో అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు.

అన్నాసాగర్‌లో వైద్యశిబిరం

భూత్పూర్ : మండలంలోని అన్నాసాగర్‌లో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. మహబూబ్‌నగర్‌కు చెందిన రవి ఫౌండేషన్, రవి చిన్న పిల్లల ఆస్పత్రి సహకారంతో సన్ రైజ్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు డా.శేఖర్‌తో పాటు పలువురు వైద్యులు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 150 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. సన్‌రైజ్ గ్లోబల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కృష్ణమోహన్‌ను అభినందించారు.

పీయూ ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లాఅధ్యక్షుడు భరత్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్షుడిగా బత్తిని రాము, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రామ్‌చందర్, శిరీష, సాయి, కార్యదర్శులు బద్రు, రమేష్, విద్యులత, శేఖర్‌తో పా టు మరో 15మంది సభ్యులను ఎంపికచేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కి చెందిన బోయ చంద్రశేఖర్, బోయ వెంకటయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన రామస్వామి, శివపై మంగళవారం రాత్రి దాడిచేశారని బాధితులు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేశారు. అదే ఘటనలో రామస్వామి, శివపై చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను రోగులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని ఈఎంఆర్ఐ ఆడిటర్ ఫయాజ్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో ఉన్న అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో వైద్యపరికరాలను, మందులను పరిశీలించారు. అనంతరం రికార్డుల నిర్వాహణ బాగుండాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా మేనేజర్ ఉదయ్‌కుమార్, కోయిల్‌కొండ ఈఎంటీ సుప్రజ, పైలట్ రాజశేఖర్‌గౌడ్ ఉన్నారు.

చౌరస్తాలో ట్రా'ఫికర్'

- ఇష్టానుసారంగా రాకపోకలు
- రోడ్లపైనే వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పోలీసును నియమించాలంటున్న స్థానికులు



భూత్పూర్ చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న పోలీస్ ఔట్‌పోస్టు

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు, ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్ల క్రితం చౌరస్తాలో ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు ఒక కానిస్టేబుల్, హోంగార్డును నియమించారు. కానిస్టేబుల్ పదవీ విరమణ పొందడంతో అప్పటి నుంచి నేటివరకు ఎవరినీ నియమించలేదు. క్రమ క్రమంగా పట్టణం విస్తరిస్తుండటంతో పాటు బస్సులు నిలిచేందుకు స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తుండటంతో వాహనదారులు తమ వాహనాలను బ్రిడ్జి కింద నిలిపి వెళ్తుంటారు. వాహనాలు ఇంటర్నల్ రోడ్డుపై నిలపడంతో పాదచారులకు సైతం నడవడానికి ఇబ్బందిగా మారింది. చౌరస్తాలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసు ఉన్నతాధికారుల చొరవ తీసుకొని ఔట్‌పోస్టులో కానిస్టేబుల్, హోంగార్డును నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకి భూమిపూజ

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా బుధవారం గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించిన అనంతరం భూమి పూజ చేసి శివాజీ విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభించారు. పలువురు ప్రముఖులు మాట్లాడారు. మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, నరేందర్, సంజీవరెడ్డి, మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్లు గోపాల్, కృష్ణయ్య, నారాయణరెడ్డి, బబ్లు, కార్తీక్, శ్రీనివాస్‌చారి, సంపత్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అడ్డాకుల: ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ బుధవారం మూసాపేటలోని రైతు వేదికలో ఎంపీడీఓ కృష్ణయ్యను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించడం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందించేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు యాదయ్యయగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, రామకృష్ణ, శ్రీలత, వెంకటేశ్వరమ్మ, కృష్ణ, మన్నెం, పులేందర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవాబుపేట: బీసీ రిజర్వేషన్లు పెంచటంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హమీద్, రమేష్‌గౌడ్, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు, కుమార్, వెంకటయ్య, నర్సింహులు, నీలకంఠ, సత్యం, జమ్ము, రామకృష్ణ, నర్సింహులు ఉన్నారు.

జడ్చర్ల: రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లుకు ఆమోదం పలకడంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. అంతకు ముందు అంబేడ్కర్, ,జ్యోతిబాపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, నాయకులు రవిశంకర్, మినాజ్, జనార్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక బస్టాండ్ వద్ద..

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం అలాగే బీసీ రిజర్వేషన్ల పెంచుటకు అసెంబ్లీ తీర్మానం చేయడం పట్ల బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈసందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, వెంకటయ్య, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కృష్ణ, హరి, జహీర్, శ్రీశైలం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

కోయిల్‌కొండ: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరిగిందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జి.రవీందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థికసాయం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బీఫార్మసీ రెండో సంవత్సరం విద్యార్థిని నందిని కామెర్లు, థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ ఇటీవలే మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న పీయూ వీసీ శ్రీనివాస్ బుధవారం భూత్పూర్ మండలం, పోతులమడుగుకి వెళ్లి విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా రూ. 25వేల ఆర్థికసహాయం అందించి విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రవికాంత్, సూర్యనాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 19, 47, 48, 49వ డివిజన్ల పరిధిలోని పలు వీధుల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ పరిశీలించారు. నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి సూచించారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



మిడ్జిల్‌లో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. 30 సంవత్సరాల నుంచి ఉద్యమం చేస్తే నేటికి ఫలితం దక్కిందని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి జంగయ్య అన్నారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. సురేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తాలో...

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిందని ఎమ్మార్పీఎస్ జిల్లానాయకుడు శ్రీరాములు అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ బుధవారం తెలంగాణ చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

గండేడ్: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.